1
నవతెలంగాణ
మెదక్
సోమవారం | 05 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

బ్లడ్ డొనేషన్ కోసం యువత పోటీ పడాలి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

మందు, మటన్, చికెన్ బిర్యానీ తినడనికి పోటీ పడటం కాదని, బ్లడ్ డొనేషన్ చేయడంలో యువత పోటీ పడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు అన్నారు. ఆదివారం హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 24/7 అనే గ్రూపు యువకులు బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. బ్లడ్ డొనేషన్ చేసిన మండల అధ్యక్షుడు చందు మాట్లాడారు యువత మందుకు బానిసలు కావద్దన్నారు. బ్లడ్ డొనేషన్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు బ్లడ్ ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పి సి సి సభ్యులు కెడం లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదు



నవ తెలంగాణ - సిద్దిపేట

సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, విద్యార్థులకు వార్డెన్ లు అందుబాటులో ఉండాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ కాసోజు నాగజ్యోతి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహాలను సిద్దిపేట జిల్లా గర్ల్స్ నాయకులతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని, స్థానికంగా ఉంటూ విద్యార్థుల సమస్యలు తెలులుకోవలాని వార్డెన్లకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లపై ఉన్నత అధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా గర్ల్స్ నాయకులు శ్రీజ, సుకన్య అరుణ, రీతూ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

క్రషర్లను మూసివేయాలి

- బ్లాస్టింగ్‌లో గాయపడిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి
- సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవ తెలంగాణ కంది

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న క్రషర్లను మూసివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్‌లో గాయపడిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. మండలంలోని ఏర్దనూర్ గ్రామ శివారులో గల జీఐ ర్యాంక్ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రషర్ బ్లాస్టింగ్‌లో గాయపడిన రమావత్ భీముడు కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రషర్ యాజమాన్యం ఎలాంటి ముందస్తు హెచ్చరికలు చేయకుండానే బ్లాస్టింగ్ నిర్వహించడంతో గ్రామానికి చెందిన రైతుకు బలమైన గాయమైందన్నారు. బాధితుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితుని కుటుంబంన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. క్రషింగ్ కంపెనీల వల్ల రైతులు ఎలాంటి పనులు చేసుకోలేక కూలీలుగా మారుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం అక్కడ ఉన్న క్రషింగ్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కృష్ణ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

- రూ.12 లక్షల విలువైన 84 కిలోల ఎండుగంజాయి స్వాధీనం



నవతెలంగాణ పటాన్ చెరు

కారులో అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్న సంఘటన మండలంలోని ముత్తంగి టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది. మెదక్ ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రోగ్రాం వివరాల మేరకు... నల్లగొండ జిల్లా బొల్లారం పట్టి గ్రామానికి చెందిన రమావత్, రమేష్, చంద్ర శనివారం రాత్రి పది గంటల సమయంలో బొలెరో కారులో హైదరాబాదు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నారు. మండలంలోని ముత్తంగి ఓఆర్ఆర్. టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో అక్రమంగా కారులో తరలిస్తున్న ఎండు గంజాయిని పట్టుకున్నారు. రూ.12 లక్షల విలువైన 84 కిలోల ఎండు గంజాయి, బొలెరో కారుతో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

నర్సన్నపేట గ్రామ పాలక వర్గానికి సన్మానం



నవతెలంగాణ-మర్కుక్

ఐదు సంవత్సరాలుగా నర్సన్నపేట సర్పంచిగా ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తి నిచ్చిందని నర్సన్నపేట తాజా మాజీ సర్పంచ్ కానుగంటి మాధవి రాజిరెడ్డి అన్నారు. మండల పరిదిలోని నర్సన్నపేట గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని సన్మానం చేశారు. గ్రామ పంచాయతీ పాలక వర్గానికి మోమెటోలను అందజేసి ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రత్యేకా అధికారి ఎవో నాగేందర్ రెడ్డి, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్,వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,ఎంపిటిసి గోలి నరేందర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత,కోఆప్షన్ సభ్యులు రాజిరెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణవేణి, వార్డు సభ్యులు రూపా, బాలమణి, నర్సింహ్మారెడ్డి, యాకమ్మ గణేష్, శ్రీకాంత్, నాయకులు రాంరెడ్డి, యాదవరెడ్డి, ఎల్లారెడ్డి, దేశాయిరెడ్డి, మహేందర్ రెడ్డి, మాదవరెడ్డి, మదుసుదన్ రెడ్డి, వెంకటేష్, హరి, నరేష్, కృష్ణ, భాస్కర్, తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి షోటకన్ కరాటే టోర్నమెంట్‌కు సిద్దిపేట విద్యార్థులు



నవ తెలంగాణ - సిద్దిపేట

ఈ నెల 11న నల్గొండ లో శివఆంజనేయ గార్డెన్ లో జరిగే 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి షోటకన్ కరాటే టోర్నమెంట్ కీ సిద్దిపేట నుంచి 45 మంది కరాటే చిన్నారులు ఎంపిక అయినట్టు కరాటే మాస్టర్ భాగ్యరాజ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక విపంచి కాలనిలయంలో కరాటే శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగిందనీ, ఎంపికైన కరాటే చిన్నరులను సౌత్ ఇండియ చీఫ్ ఎక్సమినర్ రాపోల్ సుదర్శన్, సిద్దిపేట జిల్లా చీఫ్ రాచకొండ ఆంజనేయులు ఫోను ద్వార శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ బెల్ట్ కోచస్ శ్రీధర్, కిర్తన, తేజస్విన్, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

రజక సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన నంగునూరి శ్రీనివాస్‌ను మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఓటింగ్ పద్దతిన మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షుడిగా జాలిగాం చంద్రయ్య, ఉపాధ్యాక్షుడిగా జాలిగాం రాజయ్య, కార్యదర్శిగా బస్వరాజు రాకేష్, కోశాధికారిగా ఉప్పరపల్లి రాజు, సలహాదారులుగా గడ్డం ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా పైడిపల్లి సంపతి, సుంకరి సారయ్య, జాలిగాం మల్లయ్య, గంప మహేష్, నాంపెల్లి వెంకటి, జాలిగాం అంజయ్యలను ఎన్నుకున్నారు. ఈ సదర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా కృషిచేస్తానని తెలిపారు.

కూటిగల్ బెక్కల్‌లో భక్తిపాట చిత్రీకరణ



నవ తెలంగాణ- మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్ కూటిగల్ గ్రామాలలో కేకే మ్యూజిక్ వారి కేమిడీ కనకరాజు దర్శకత్వంలో సిలకలాది గట్టు అబ్బీయా అనే భక్తిపాట షఊటింగ్ ఆదివారం స్థానిక సమ్మక్క సారలమ్మ వద్ద ప్రముఖ ప్రజా గాయకులు పిన్నింటి రత్నం క్లాప్ కొట్టి ప్రారంభం చేయడం జరిగింది,ఈ సందర్భంగా కో ఆపరేటివ్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి మాట్లాడుతూ. .పల్లె సంస్కృతి సంప్రదాయలకు నెలవైనది మన తెలంగాణ అని అలాగే సమ్మక్క సారలమ్మా పోరాటల పటిమతోనే తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు,ఈ కార్యక్రమంలో కూటిగల్ పాల్గొన్నారు.

ప్రేరణ మనక్‌కు రాష్ట్రస్థాయికి 15 ప్రాజెక్టుల ఎంపిక

నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్రస్థాయి ప్రేరణ మనక్ కు సిద్దిపేట జిల్లా నుండి 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లోనే సిద్దిపేట జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో1666 ప్రాజెక్టులు అప్లోడ్ చేయగా, ఉత్తమమైన 156 ప్రాజెక్టులను ఎంపిక చేసి, సంబంధిత విద్యార్థి వ్యక్తిగత అకౌంట్లో రూ 10వేలు జమ చేయడం జరిగిందనీ తెలిపారు. వాటి నుండి 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు. డి.సాత్విక్, నవ్య శ్రీ , రాకేష్, ఎస్. స్వాతి, టి.తనీష్, కే. శివాజీ, కే. దీక్షిత, కే. పూర్ణ తేజ, ఎల్. స్రవంతి, కే. రాకేష్, ఎస్. కీర్తన, ఎల్ .శృతి, బి. రాజేష్, ఎం. లక్ష్మీనరసింహగౌడ్, ఎం బాలాజీ చారి రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటి, జాతీయస్థాయిలో ప్రదర్శన ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు.

పార్టీ బలోపేతం.. హరీశ్‌రావే టార్గెట్

- 6న సిద్దిపేటకు మైనంపల్లి హన్మంతరావు రాక
- తెలంగాణ రాకముందు జగడం • వచ్చిన తర్వాత కూడా జగడం
- మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్న బీఆర్ఎస్ నాయకులు

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ, కార్యకర్తల్లో చైతన్య నింపడం కోసం స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావును రాజకీయంగా టార్గెట్ చేయడానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సిద్దిపేటకు 6న వస్తున్నారు. పట్టణంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నారు. ఈమధ్యనే రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడు రోహిత్‌రావుకు మెదక్ ఎమ్మెల్యే టికెట్ కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరగా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మూలంగానే తన కుమారునికి టికెట్టు రాలేదని, తిరుపతిలో వెంకటేశ్వర స్వామి దర్శించుకున్న తర్వాత మైనంపల్లి మీడియాతో హరీశ్‌రావు తన టార్గెట్ అంటూ మండిపడ్డారు. అన్న విధంగానే ఈ నెల 6న మైనంపల్లి సిద్దిపేటకు వస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

హరీశ్‌రావుకు బుద్ధి చెప్తా

సిద్దిపేటలో హరీశ్‌రావు అడ్రస్ లేకుండా చేస్తా. హరీష్‌రావును గద్దెదించే వరకు, ఆయన దుకాణం బంద్ చేసే వరకు విశ్రమించను. వెంకటేశ్వర స్వామి సాక్షిగా ప్రమాణం చేస్తున్నా' అని మైనంపల్లి తిరుపతిలో తన కోపాన్ని ప్రకటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ తన కుమారునికి ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరి తాను మల్కాజిగిరి నుంచి, తన కుమారుడు మెదక్ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. మెదక్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని ఓడించి రోహిత్‌రావు విజయం సాధించారు. మైనంపల్లి హన్మంతరావు మాత్రం ఓటమి చెందారు. తాను తిరుపతిలో చేసిన ప్రమాణాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సిద్దిపేటకు వస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రం ఏర్పాటు ముందు.. తర్వాతా జగడం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు టిడిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా మైనంపల్లి హన్మంతరావు ఉన్న సమయంలో సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం జరిగింది. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మైనంపల్లి తిరిగి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మధ్యనే జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో తన కుమారునికి బీఆర్ఎస్ పార్టీ నుండి టికెట్ రాకుండా హరీశ్‌రావే అడ్డుపడ్డాడని, మళ్లీ తిరిగి వారి మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. ఇదే ఇప్పుడు సిద్దిపేటలో చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్ పార్టీలో చేరనున్న బీఆర్ఎస్ నాయకులు

ఈ నెల 6న సిద్దిపేటకు రానున్న మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, తాజా మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. టిడిపిలో ఉన్నప్పటి నుండి సిద్దిపేటలో ఓ వర్గం మైనంపల్లికి సన్నిహితంగా ఉంటూ, నేటి వరకు కూడా అతనితో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తుంది. అదే విధంగా కొంతమంది కాంగ్రెస్ పార్టీ నుండి గతంలో బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చిన వారు, తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి ఇది వేదిక చేసుకున్నట్లు తెలుస్తుంది.

కాంగ్రెస్ మోసపూరిత హామీలపై ఆలోచనలో పడ్డ ప్రజలు

- ప్రభుత్వం లేదని చింతించొద్దు
- ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం
- 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి దౌర్జన్యాలను చూడలేం
- అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రతిపక్షాలపై దౌర్జన్యకాండ
- మెదక్ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే
- పటాన్‌చెరులో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవ తెలంగాణ - పటాన్ చెరు



కాంగ్రెస్ మోసపూరిత హామీలపై ప్రజలు ఆలోచనలో పడ్డారని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణ, మదన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదం, పటాన్చెరు నియోజకవర్గ ప్రజల నమ్మకం, పార్టీ కార్యకర్తల కృషితో హ్యాట్రిక్ విజయాన్ని సాధించడం జరిగిందని తెలిపారు.చేసిన పనిని చెప్పుకోవడంలో కొద్దిగా విఫలం అయ్యామని, మోసపూరిత హామీలు గుప్పించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజమని, అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు దిగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ప్రజలు అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలే తప్ప, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజలు ఇంటికి పంపించడం ఖాయమని తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులని, ఎటువంటి కష్టం వచ్చినా 24 గంటలు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటామని తెలిపారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికల ముందు సెమీఫైనల్స్ లాంటివని తెలిపారు. సమిష్టిగా పని చేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు స్థానం నుండి పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు గాలి అనిల్ కుమార్, భూపాల్ రెడ్డి ల పేర్లను పరిశీలించాలని ఆయన అధిష్టానానికి విన్నవించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరికి టికెట్ కేటాయించిన మెదక్ పార్లమెంట్ పై గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అటవీ సంస్థ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంటనే పెన్షన్లు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, మల్లేశం

నవతెలంగాణ - మెదక్



జిల్లాలోని పెన్షన్‌దారులకు వెంటనే పెన్షన్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, మల్లేశం పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని వృద్ధులకు వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ఇతర పెన్షన్ దారులకు పెన్షన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెన్షన్ దారులు సుమారుగా 1,15,000 మంది ఉన్నారన్నారు. వృద్ధులు 30,000, వితంతువులు 45000, వికలాంగులు 9500, బీడీ కార్మికులు 15000, ఒంటరి మహిళలు 14000, ఇతర పంచదారులకు పెన్షన్ రాక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెన్షన్ దారులకు సరైన సమయానికి ఇవ్వకపోవడం వలన ప్రభుత్వం కూలిపోయిందని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం నూతనంగా ఏర్పడి రెండు నెలలు గడుస్తున్న గత ప్రభుత్వం మాదిరిగా సమయానికి పెన్షన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు నిత్యవసర ఖర్చులకు వైద్యం ఖర్చులకు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వితంతువులకు ఇంటి అద్దెలు పిల్లల చదువులు వంటి ఖర్చులకు పెన్షన్ రాక గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఒంటరి మహిళలు వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో వృద్ధులతో వితంతులతో వికలాంగులతో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహిళా కన్వీనర్ నాగమణి, జిల్లా నాయకులు రాజిరెడ్డి, ఐలయ్య, రామస్వామి, సత్యం, కమల, తదితరులు పాల్గొన్నారు.

నేనే రాజు.. నేనే మంత్రి


- మేం చెప్పిందే వేదం
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి
- కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకులా అదృష్టం
- ఓడిపోయినా నర్సారెడ్డికి పవర్స్ ఇచ్చిన సీఎం

నవతెలంగాణ ములుగు




కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకులా మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి అదృష్టం పట్టుకుంది. 2014 ఎన్నికలలో పోటీ చేసిన నర్సారెడ్డికి 34085 ఓట్లు రాగా టీడీపీ వంటేరు ప్రతాప రెడ్డికి 67303 ఓట్లు వచ్చాయి. టీఆరెస్ నుండి కేసీఆర్‌కు 86694 ఓట్లతో గెలుపొందారు. 2017లో టీఆరెస్‌లో చేరిన నర్సారెడ్డికి రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఆయన ఒక సంవత్సరం పాటు టీఆర్ఎస్‌లో ఉన్నారు. 2018లో నర్సారెడ్డి పోటీ చేయలేదు. కాంగ్రెస్ నుండి వంటేరు ప్రతాపరెడ్డి పోటీ చేయగా 67154 ఓట్లు పోలయ్యాయి. టీఆరెస్ అభ్యర్థి కేసీఆర్‌కు 125444 ఓట్లు పోలయ్యాయి. 2018 అక్టోబర్‌లో టీఆర్ ఎస్ నుంచి నర్సారెడ్డిని సస్పెండ్ చేశారు.

2023 లో కాంగ్రెస్ నుండి పోటీ చేసిన నర్సారెడ్డికి 32568 ఓట్లు రాగా బిజెపి నుండి ఈటెల రాజేందర్ కు 66653 ఓట్లు పొలయ్యాయి. టీఆరెస్ నుండి కేసీఆర్ కు 111684 ఓట్లు పోలయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నర్సారెడ్డికి అదృష్టం కలిసొచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీఫామ్ ఎవరికైతే ఇచ్చామో వారే బాస్ అని చెప్పటం వారికి అదృష్టం కలిసి వచ్చింది.



నియోజకవర్గంలో ఎవరికైనా పని కావాలంటే నర్సారెడ్డితో మంచిగా ఉండాల్సిందే. పార్టీలో ఉన్నా కూడా నర్సారెడ్డితో టచ్‌లో లేకుంటే వారి పనులు కావడం కష్టమే. మంత్రులను కలవాలన్నా సీఎంతో పని చేయించాలన్నా నర్సారెడ్డితో టచ్‌లో ఉండాలి. ములుగు మండల పరిధిలో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు నిరుత్సాహానికి గురవుతున్నారు. 10 సంవత్సరాలు అపోజిషన్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా కూడా అదే నిరాశలో ప్రజలు ఉన్నారంటే సమస్య ఎక్కడుందో అర్థమవుతుంది. ములుగు మండల అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా మండల పరిధిలోని కార్యకర్తలను కనీసం పట్టించుకోని స్థితిలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కోసం ఇంత త్యాగం చేస్తామని పార్టీ కోసం 10 మెట్లు కిందికి దిగుతామని ప్రకటించడంతో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులు కూడా పంతాలు పట్టింపులకు పోయి పార్టీని నిర్వీర్యం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ కోసం పనిచేసిన వారిని ఒక కంట కనిపెట్టాలని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నర్సారెడ్డి మండలంలో పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించాలని కోరుతున్నారు.

మట్టిరవాణా అనుమతుల్లేని టిప్పర్ల సీజ్



నవతెలంగాణ - గుమ్మడిదల

మూడు రోజులుగా అక్రమంగా నల్ల మట్టి రవాణా చేస్తున్నారు. భారీ సంఖ్యలో టిప్పర్ల ద్వారా నల్ల మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. భారీ సంఖ్యలో అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్నారని తహసీల్దార్ గంగాభవానీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం గుమ్మడిదల మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ లక్ష్మ రెడ్డి నేతృత్వంలో పోలీసులు మట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. 8 మట్టి టిప్పర్లను సీజ్ చేస్తున్నట్లు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో రాజగోపాల్ పేట ఎస్సై మోహన్ రెడ్డి గ్రామస్తులకు శనివారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్, క్రైమ్ నేరాల పై వివరించారు.అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- ప్రత్యేక అధికారులకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ దిశానిర్దేశం



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రత్యేక అధికారులకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ దిశానిర్దేశం చేశారు. రాత్రి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ కూమార్ సూల్తానియాతో కలిసి ములుగు జిల్లా కలెక్టరేట్ నుండి రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ 'గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. గ్రామ పంచాయతీలలో గ్రౌండ్ వర్క్ చేయాలి. యుద్ధ ప్రాతిపదికన సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయాలి' అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్, డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్య, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జెడ్పి సీఈవో రమేష్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్సి శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి పద్య సాహిత్యం ఎంతో అవసరం



నవ తెలంగాణ - సిద్దిపేట

పద్య సాహిత్యం ద్వారా సమాజంలో ఎంతగానో మార్పు తీసుకురావచ్చని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. ప్రతినెలా మన బాలసాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దిపేటలో జరిగిన అవధాని బండకాడి అంజయ్య గౌడ్ రచించిన సుధీ శతకం పుస్తక పరిచయ కార్యక్రమంలో రాజమౌళి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పద్య సాహిత్యం అలవర్చుకోవాలని అన్నారు. కవి, గాయకులు వరుకోలు లక్ష్మయ్య మాట్లాడుతూ 108 చందస్సులలో పద్యాలు రాసి శతకంగా అందించిన అవధాని బండకాడి అంజయ్య గౌడ్ సాహిత్యం అందరు చదవాల్సిందిగా కోరారు. బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం మాట్లాడుతూ నీతివంతమైన పద్యాలు సమాజాన్ని మంచి వైపుకు మరలచేందుకు కృషి చేస్తాయని, అందుకు అవధాని అంజయ్య గౌడ్ పద్య సాహిత్యం ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు బస్వ రాజ్ కుమార్, రాచకొండ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలవికాస వ్యవస్థాపకురాలి జన్మదినం

నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని సాయికృష్ణ ప్రయివేట్ ఆసుపత్రిలో రోగులకు బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాలథెరిసా జన్మదిన వేడుకల సందర్భంగా ఆదివారం రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ కోఆర్డీనేటర్ పిల్లి జ్యోతి సత్యనారాయణ మాట్లాడుతూ నిరుపేదలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్న బాలవికాస సంస్థ ఆర్థిక చేయుతకు ఎంతగానో కృషి చేస్తుందన్నారు. మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో మంచి పేరు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవి, డాక్టర్ దయాకర్, నిర్వాహకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకుంట కాలనీ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా గోనె కృష్ణహరి



నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని కాళ్లకుంట కాలనీ పద్మశాలి సంఘం కు ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గోనె కృష్ణ హరి విజయం సాధించాడని ఎన్నికల అధికారి గాలిపల్లి జగదీశ్వర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యక్షుడిగా వేముల దేవదాస్ , ప్రధాన కార్యదర్శిగా అరగొండ మల్లేశం, సహాయ కార్యదర్శిగా పుట్ట గణేష్ , కోశాధికారిగా ఎర్రగుంట నరేందర్ విజయం సాధించినట్టు తెలిపారు. గెలిచిన వారికి ఎన్నిక పత్రాలు అందజేశారు. వారిని పలువురు అభినందించారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి

నవతెలంగాణ -వెల్దుర్తి

మాసాయిపేట మండల పరిధిలో గల ప్రగతి మినరల్స్ కంపెనీలో పనిచేసే కార్మికుడు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన ఆదివారం అకింపేట గ్రామపంచాయతీ శివారులో గల వాగులో చోటు చేసుకుంది. ప్రగతి మినరల్ కంపెనీ గుత్తేదార్ తెలిపిన వివరాల ప్రకారం... మూడు నెలల క్రితం కార్మికుడు నంద పశ్చిమబెంగాల్ నుండి వచ్చి ప్రగతి మినీరల్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో అక్కింపేట గ్రామ శివారులో గల వాగులో చేపలు పట్టడానికి వెళ్లి కాలుజారి లోతైన ప్రాంతంలో పడిపోయాడు. ఈతరాకపోవడంతో ఊపిరాడక నంద మృతి చెందాడు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు.

కుంటలో పడి వృద్ధుడి మృతి




నవ తెలంగాణ - దౌల్తాబాద్

కుంటలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పట్టణానికి చెందిన గొల్ల దుబ్బయ్య(75) ఆదివారం తన గేదెకు దౌల్తాబాద్ సమీపంలో ఉన్న కొత్త కుంటలో నీళ్లు తాపుతున్నాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి దుబ్బయ్య మృతి చెందారు. అతని కుమారుడు గొల్ల యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సాయిలు తెలిపారు.

సిద్దిపేట నుండే బీఆర్ఎస్ పతనాన్ని ప్రారంభిద్దాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవ తెలంగాణ - సిద్దిపేట

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెడదామని, సిద్దిపేట నుండే బి ఆర్ ఎస్ పతనాన్ని ప్రారంభిద్దామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేటలో ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈనెల 6న సిద్దిపేటలో టిపిసిసి తెలంగాణ ఇన్చార్జ్ దీపా దాస్ మున్షి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు పర్యటన ఉన్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. మధ్యాహ్నం బిజేఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పిస్తారని, ముసాబాద్ చౌరస్తా వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుంచి 9వ వార్డులో పట్టణ అధ్యక్షులు అత్తూ ఇమామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ, రూరల్ పోలీస్ స్టేషన్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, మెడికల్ కాలేజ్ ముందు ఉన్న కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం భూమి పూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం సమావేశం ఉంటుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసేందుకు పలు సూచనలు ఇస్తూ, నాయకులు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారని అన్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లపాటు కేసీఆర్ కు అధికారం ఇస్తే అధికార దుర్వినియోగం చేశారని , రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసిన పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లారని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్క సతీష్ గౌడ్, కలిముద్దీన్ , తిరుపతి, రాజ్ నరేందర్, షాబుద్దీన్, హర్షద్, మున్నా వహాబ్, గుర్రం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

సంగారెడ్డి
సోమవారం | 05 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ఖేడ్‌కు నిధులు మంజూరు చేయాలని సీఎంకు వినతి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శనివారం రాత్రి సెక్రటేరియట్‌లో సీఎంని కలిసి వినతిపత్రం అంజేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఖేడ్ నియోజక వర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరగానే.. సీఎం సానుకూలంగా స్పందించి నిధుల మంజూరీకి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-కల్హేర్

సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రితియాజ్ వివాహం కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి బ్రదర్స్ మహా రెడ్డి భూపాల్ రెడ్డి, మహారెడ్డి విజయ్‌పాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాఘవరెడ్డి, సర్పంచ్ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వంశీరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వారం క్రితం మహిళ మృతి

- కుటుంబ సభ్యులెవరూ రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు..



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ మహిళ వారం రోజుల క్రితం మృతి చెందింది. నాటి నుంచి ఆమెకు సంబ ంధించిన కుటుంబ సభ్యుల కోసం ఎదురుచూస్తున్నా.. ఎవరూ రాకపోవడంతో వైద్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 22వ తారీఖున ఓ వ్యక్తి గాయా లతో ఉన్న ఓ మహిళను ప్రభుత్వాసత్రికి తీసుకువచ్చాడు. ఆమె పేరు సాయమ్మ(40), భర్త ఎల్లప్ప అని.. ఆమెది సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదే రాగా వివరాలు ఇచ్చి ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు. 9177932401, 8074433276 తన మొబైల్ నెంబర్లుగా కేస్‌షీట్‌లో రాయించాడు. అయితే ఆ మహిళ కుడి కాలుకు, కింది పెదవులకు గాయమై ఉన్నది. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న ఆమె జనవరి 27న రాత్రి 9.30గంటలకు మృతి చెంది ంది. అయితే ఆమెకు సంబంధించి వారెవరూ అందుబాటులో లేకపోవడంతో.. ఎవరైనా వస్తారేమో అని ఇప్పటివరకు ఆసుపత్రి యాజమాన్యం ఎదురుచూసింది. కానీ ఎవరూ రాకపోవడంతో డాక్టర్స్/వార్డ్‌బాయ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో మృతదేహాన్ని మార్చురీలోని ఫ్రీజర్ బాక్స్‌లో భద్రపరిచినట్టు సీఐ తెలిపారు. ఎవరైనా మృతురాలిని గుర్తుపడితే సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలన్నారు.

కరెంట్ షాక్‌తో వివాహిత మృతి



నవతెలంగాణ-జోగిపేట

వాటర్ హీటర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కొట్టడంతో ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన అందోల్ మండలంలోని మాసానిపల్లి గ్రామ ంలో ఆదివారం ఉదయం జరిగింది. జోగిపేట ఎస్ఐ-2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాసానిపల్లి గ్రామానికి చెందిన బంటు పవిత్ర(21) అనే వివాహిత ఆదివారం ఉదయం వేడి నీళ్ల కోసం వాటర్ హీటర్ పెట్టింది. నీళ్లు వేడికావడంతో స్విచ్ నుం చి వాటర్ హీటర్‌ను తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టింది. దీంతో హుటాహుటిన జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా మృతురాలి స్వస్థలం జోగిపేట. గత 11 నెలల క్రితం మాసానిపల్లి గ్రామానికి చెందిన బంటు నవీన్ అనే యువ కుడితో ఆమెకు వివాహం జరిగింది. భార్య భర్తలు ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండే వారని.. కరెంటు షాక్ రూపంలో మృత్యువు వారిద్దరిని విడదీసిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నియోజవర్గస్థాయి బీఆర్ఎస్ సమావేశానికి మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బీఆర్ఎస్ పటాన్చెరు నియోజకవర్గ స్థాయి, మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బొల్లారం మునిసిపల్ చైర్మెన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, వేణుపాల్ రెడ్డి, బీరప్ప యాదవ్, రత్నం, ప్రభు, పుండరికం, పరుశురాం, శ్రీకాంత్ యాదవ్, సతీష్ యాదవ్, సాయి కిరణ్, మునిసిపల్ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన కొండాపురం జగన్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ అశోక్ కుమార్‌ను తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి.. శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి జిల్లా కార్యదర్శి దమ్మగల్ల మురాహరి, జెల్ల సురేష్, బేగరి ప్రసాద్, నరేష్, ప్రభాకర్ ఉన్నారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు ప్రేరణ తరగతులు



నవతెలంగాణ-జోగిపేట

నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపేటలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని ఓపెన్ డిగ్రీ కోఆర్డినేటర్ ఎ.గోపాల్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ.. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అందరికీ విద్య చేరువవుతుందన్నారు. ప్రతీ ఒక్కరికి విద్య అందాలనేది యూనివర్సిటీ లక్ష్యమన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు వస్తున్నాయని సాంకేతిక పరిజ్ఞానం అంతర్భాగమైందన్నారు. అనేకమంది పేద విద్యార్థులు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. అభ్యాసకులకు ఈ స్టడీ సెంటర్ ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఓపెన్ డిగ్రీ విధానంలో ఉన్న వెసులుబాటును, సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ కౌన్సిలర్లు శ్రీనివాస్, జక్కుల మల్లేశం ,సురేష్, ప్రభాకర్, మల్లికార్జున్ రెడ్డి, విద్యాసాగర్, ప్రఫుల్ల కుమార్ పాల్గొన్నారు.

మూలమలుపులతో ప్రమాదాలు..



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండంలంలోని మామిడ్గి నుంచి రాజోల వెళ్ళే రోడ్డు మూల మలుపులతో ప్రమాదకరంగా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నది. ఓ పక్క మూలమలుపులు, మరోపక్క పిచ్చి మొక్కలతో రోడ్డు మొత్తం ప్రమాదరకంగా మారడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. మామిడ్గి వెళ్లే రోడ్లలో నిత్యం వివిధ గ్రామాల ప్రజలు బీదర్ పట్టణాలకు వెళ్తుంటారు. అయితే మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే కనీసం సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తుప్పు పట్టి ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం





నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మండలంలోని అబ్బేంద గ్రామంలో ఇనుప విద్యుత్ స్తంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. ఆ స్తంభం కింది భాగంలో తుప్పుపట్టి రంధ్రాలు ఏర్పడ్డాయని.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రాకల్ గ్రామంలో విద్యుత్ స్తంభం చుట్టూ ఆకు తీగలు అల్లుకుపోయాయని.. దాంతో షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉన్నదని స్థానికులు చెబుతున్నారు. సంజీవరావుపేటలో పోల్ విరిగే పరిస్థితి ఉన్న పట్టించుకోవడం లేదని మండల ఎలక్ట్రిసిటీ అధికారి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండండి

- ఆరోగ్యాన్ని కాపాడుకోండి..
- హెూప్ హాస్పిటల్ నిర్వహించిన సదస్సులో ఎస్పీ రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రజలకు సూచించారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ ఆడిటోరియంలో హెూప్ హాస్పిటల్ వారు 'సేఫ్ హార్ట్ సంగారెడ్డి' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హాజరై మాట్లాడారు. మద్యపానం, దూమాపానం, శరీర శ్రమ లేకపోవడం, చెడు ఆహారపు అలవాట్లే గుండె సమస్యలకు కారణమన్నారు. హెూప్ హాస్పిటల్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. డా.గౌతమ్ ఏమర్జెన్సీ ఫిజిషియన్ మాట్లాడుతూ.. హఠాత్తుగా గుండెపోటు వచ్చిన వారికి తక్షణమే సీపీఆర్ ప్రక్రియ ఎలా చేయాలో తెలిపారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలాజిస్ట్ డా.అనిల్ మాట్లాడుతూ.. గుండె పనితీరు, తినే ఆహారపు అలవాట్లలో మార్పులు, వివిధ రకాలైన గుండె జబ్బుల బారిన పడకుండా పలు జాగ్రత్తలు సూచించారు. రాబోయే ముడు నెలల్లో సంగారెడ్డి జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన లక్షకు పైగా సామాన్యులకు గుండె వ్యాధులను ఎలా నివారించాలో తెలుపుతూ.. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ప్రక్రియను ఎలా చేయాలో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం లోగో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా. కృష్ణమూర్తి, ఐఎంఏ ప్రెసిడెంట్, డా. ఉషా కిరణ్, ఐఎంఏ సెక్రటరీ సిహెచ్. చక్రపాని, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను సంక్షోభంలోకి నెట్టేలా కేంద్ర బడ్జెట్

- సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు మాణిక్
- ఖేడ్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్.. సంపన్నులకు దోచిపెట్టి, రైతులను సంక్షోభంలోకి నెట్టే విధంగా ఉన్నదని సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. ఈ మేరకు నారాయ ణఖేడ్‌లో రైతు, కార్మిక, విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం పదేండ్ల కాలంలో దేశ సంపదను సంపన్నులకే దోచిపెట్టిందన్నారు. మోడీ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కేంద్ర బడ్జెట్లో వెనుకబడిన నారాయణఖేడ్ లాంటి ప్రాంతాలభివృద్ధి పట్ల ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలో ఇరిగేషన్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి సాగునీరు ఇచ్చేందుకు ఎలాంటి ప్రతిపాదన చేయలేదన్నారు. అకోలా నుంచి నారాయణఖేడ్ మీదుగా బీదర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటుకు ఎలాంటి ప్రతిపాదన లేదన్నారు. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం చూస్తే.. ఇది ఎన్నికల్లో ఓట్లు పొందడం కోసం తప్పా ప్రజల సంక్షేమం కోసం కాదని తెలిసిపోతున్నదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు తగ్గింపు గురించి బడ్జెట్‌లో ఊసే లేదన్నారు. సంపన్నులకు రాయితీలు ఇచ్చి, పేదలు, రైతులపై భారాన్ని మోపేలా బడ్జెట్ ఉన్నదన్నారు. కాబట్టి రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక మోడీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సతీష్ నర్సింలు, చిరంజీవి మోషప్ప, సంతోష్, పవన్, సత్య వందన, సీఐటీయూ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, రైతు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధికి నోచుకోని రాజీవ్ పార్క్

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోనీ రాజీవ్ పార్క్ అభివృద్ధిని ప్రభుత్వం మూడేండ్లుగా పట్టించుకోవడం లేదని జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ ఆరోపించారు. జన జాగృతి సేన ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌పార్క్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనంతో కళకళలాడే రాజీవ్ పార్క్‌ను కరోనా సమయంలో లాక్‌డౌన్ వల్ల మూసేయడంతో పిచ్చి మొక్కలు పెరిగి, ఆట పరికరాలు తుప్పు పట్టాయన్నారు. పార్క్ ఓ అడవిని తలపిస్తూ అసాంఘిక కార్యక్రమలకు అడ్డాగా మారిందన్నారు. పార్కులో కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకరంగా గడిపే పరిస్థితే లేదన్నారు. లైటింగ్ సౌకర్యం లేకపోవడంతో ప్రతీ రోజు సాయంత్రం 6 గంటలకు పార్క్ మూసివేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలు కేటాయించి రాజీవ్ పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో సాయికుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఖేడ్ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం నారాయణఖేడ్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ కమిటీని వేశారు. కన్వీనర్‌గా తేజ, కో-కన్వీనర్‌గా సమతను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణీ మాట్లాడుతూ.. మహిళల కోసం అనేక చట్టాలు అమలులో ఉన్నప్పటికీ.. నేడు దేశంలో మహిళలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ప్రతి ఒక్కరు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్, డివిజన్ నాయకులు వందన, పవన్ సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉజ్వల్‌రెడ్డికి అందరి అండా ఉండాలి



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ముద్దుబిడ్డ, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు అట్టడుగు వర్గాల ప్రజల వద్దకు చేరడం ఎంతో హర్షించదగ్గ విషయమని.. కాబట్టి ఆయనకు అందరి అండా ఉండాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఉజ్వల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహి ంచిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ ఉజ్వల్ రెడ్డి మృదువైన స్వభావి అని, అట్టడుగు వర్గాల సేవలందించేందుకు అమెరికా నుంచి తిరిగి స్వదేశానికి వచ్చారన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిది లో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మన్న నలు పొందుతున్నారన్నారు. సేవ పొందిన వారు, పొందని వారు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఉజ్వల్‌రెడ్డికి ఎల్లవేళలా అండగా నిలవాలని సూచించారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని బాన్సువాడ, జుక్కల్, నారాయణఖేడ్, ఆందోల్, ఎల్లారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాలనీ వాసులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను కరువు పరిస్థితుల్లో కూడా జహీరాబాద్‌తో పాటు పార్లమెంటు నియోజకవర్గంలో మొత్తం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు కృషి చేశానన్నారు. అక్కడక్కడ వైద్యశాలలు ఏర్పాటు చేసి ఉచిత వైద్య సలహాలను ఆన్లైన్ ద్వారా అందించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉజ్వల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలు అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, నరసింహారెడ్డి, ఖాజామీయా, భాస్కర్ యాదవ్, టిల్లు, జుబేర్ అహ్మద్, బర్కత్, మురళీకృష్ణగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు చిరునామా శ్రీ చైతన్య సీబీఎస్ స్కూల్

- పటాన్‌చెరు ఎంఈఓ పి.పి రాథోడ్
- విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ
- శ్రీ చైతన్య పాఠశాల డైరెక్టర్ కే.నరసింహ, విజయలక్ష్మి



నవతెలంగాణ-పటాన్‌చెరు

నాణ్యమైన విద్యకు చిరునామాగా పట్టణంలోని శ్రీ చైతన్య సీబీఎస్ స్కూల్ నిలుస్తున్నదని మండల విద్యాధికారి పిపి రాథోడ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ చైతన్య సీబీఎస్ పాఠశాలలో డైరెక్టర్ కే.నరసింహ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం రాత్రి వార్షికోత్సవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పటాన్‌చెరు ఎంఈఓ పి.పి రాథోడ్, మాజీ కార్పొరేటర్ సపన దేవ్‌లు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యకు చిరునామా శ్రీ చైతన్య సీబీఎస్ పాఠశాల అని కొనియాడారు. విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణతో ఎలా మెలగాలో విద్యార్థులకు నేర్పుతున్నా రన్నారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి రేపటి భావి భారత పౌరులుగా పాఠశాలకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా శ్రీ చైతన్య పాఠశాల డైరెక్టర్ కే.నరసింహ విజయలక్ష్మి మాట్లాడుతూ... విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యాలు పెంచడానికి పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. పాఠశాల 1992 ఏర్పడ్డ నాటి నుంచి 32 ఏండ్లుగా విద్యను అందిస్తున్నదన్నారు. ఈ ఏడాది సీబీఎస్ పాఠశాలలో అకాడమిక్ ఇంచార్జిగా శ్రీరామ్ నివాస్ రాముని నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా తరగతి గదిలో డిజిటలేషన్ ప్యానెల్ బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మూడ్రోజులకొకసారి యోగా డే కార్యక్రమాన్ని అంజిరెడ్డితో నిర్వహించడం జరుగుతున్నదన్నారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య సీబీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ముదిరాజుల మద్దతు



నవతెలంగాణ-జోగిపేట

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు కాంగ్రెస్‌కే మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పొలిట్ బ్యూరో సభ్యులు బానిస నారాయణ తెలిపారు. మునిపల్లి మండల పరిధిలోని పెద్ద చెల్మెడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ మహాసభలో నారాయణ మాట్లాడుతూ.. ముదిరాజులను బిసి-డి నుంచి ఏ లోకి మార్చేందుకు కాంగ్రెస్ చర్యలు తీసుకుంటున్నందున.. వారికే మద్దతు ప్రకటించే అవకాశం ఉన్నదన్నారు. ముదిరాజ్ మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ముదిరాజ్ కులస్తులు మత్స్యకారులగా అనేక ఏండ్ల నుంచి చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. వారి ప్రధాన వృత్తి చేపల వేట అయినప్పటికీ.. వారిని గత ప్రభుత్వం గుర్తించకపోగా వారిని ఆదుకోవడంలో విఫలమైందన్నారు. వానకాలం విడవాల్సిన చేప పిల్లలను కాలం వెళ్ళిన తర్వాత చెరువుల్లో వదులుతున్నారని.. దాంతో చేప పిల్లలు ఎదుగక మత్స్యకారులు నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఎలాంటి సబ్సిడీ వాహనాలు అందలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించి వారికి వాహనాలు మంజూరు చేసి, సబ్సిడీపై లోన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వటపల్లి ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షులు బాగన్న, సదాశివపేట్ రఘు, సూదనయ్య, ఓంశాంతి మల్లన్న, లక్ష్మణ్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం, జిల్లా కార్యదర్శి సాయిలు
- సంగారెడ్డిలో సమ్మె పోస్టర్ విడుదల.. జోగిపేటలో కరపత్రాల పంపిణీ







నవతెలంగాణ-సంగారెడ్డి, జోగిపేట

బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సమ్మె గ్రామీణ బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సుందరయ్య భవంలో మల్లేశం అలాగే జోగిపేట పట్టణంలో కార్మికులకు, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు మాట్లాడారు. మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తున్నది తప్పా.. పేదలు, కార్మికులు, రైతుల కోసం కాదు అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తుందని అన్నారు. బీజేపీ అధికారంలోకి ఉన్న పదేండ్ల కాలంలో పేదలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఏడా దికి రెండు కోట్ల ఉద్యోగాలు, ధరల తగ్గింపు, విదేశాల్లో దాచిపెట్టిన డబ్బును తెచ్చి పేద ప్రజల ఆకౌంట్లో రూ.15 లక్షలు జమ చేస్తా మని ప్రగల్భాలు పలికినా.. ఒక్కటికూడా అమలు చేయలేదన్నారు. అంతేకాకుండా పోరాడి సాధించుకున్న చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర అవలంభిస్తున్న ఇలాంటి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ్ బంద్‌లో ప్రతీ ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు నాయకులు సంతోష్, అలీ భాయ్, అశోక్, దయానంద్, మహేష్, జోగిపేటలో అశోక్, వివిధ యూనియన్ల నాయకులు సురేష్, రాములు, కృష్ణ, నగేష్, షేక్మమ్మ, శిరీష, శివకుమార్, సాయిబాబా, రవీందర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : సదాశివపేటలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించి.. కార్మికుల దగ్గర నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అందజేయనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులు అనేక ఏండ్ల నుంచి పనిచేస్తున్నా.. చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేయిస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి ఉన్న పదేండ్ల కాలంలో పేద ప్రజల కోసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై ఈనెల 16వ రిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, యూనియన్ నాయకులు శేఖర్,సంజీవులు, నగేష్ కుమార్, మహిపాల్, అశోక్ ,రామచందర్, మాణిక్యం, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్‌టీయూటీఎస్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, కవి, కార్మిక నాయకుడు కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ జయంతి వేడుకలను ఎస్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబేర్ అలి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ఆందోల్‌లో1908 ఫిబ్రవరి 4న మొహియుద్దీన్ జన్మించారన్నారు. బహుముఖ ప్రజ్ఞా శాలిగా.. అన్ని వర్గాలకు సమన్యాయం కోసం ఉద్యమించాడన్నారు. స్టేట్‌టీచర్స్ యూనియన్ హైదరాబాద్ పేరుతో ఉపాధ్యాయ సంఘం స్థాపించి ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాటం చేసిన పోరాట యోధుడన్నారు. ప్రభుత్వం చేపడుతున్న బదిలీలు, పదోన్న తుల ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని, అన్ని కేటగిరీలో పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, సంగారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి అలీ, అంజద్‌అలీ,ప్రతాపరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యం



నవతెలంగాణ-రాయికోడ్

సీరూర్ గ్రామ బ్రిడ్జీ వద్ద ఓ గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ వెంకటొరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సీరూర్ గ్రామ బ్రిడ్జీ వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం శనివారం లభ్యమైంది. మహిళను రగ్గులో చుట్టి అందులో బండ రాయిని పెట్టి తాడుతో కట్టి నీటిలో పడేశారని ఎస్ఐ చెప్పారు. కాగా మృతురాలి వయస్సు అందాద 45 నుంచి50 ఏండ్ల మధ్యలో ఉంటుందని.. ఆమె నైటీ ధరించి ఉన్నదన్నారు. మృతురాలిని ఎవరైనా గుర్తు పడితే 8712656770, 8712656732 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

హరీశ్‌రావును కలిసిన నర్సాపూర్ మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మున్సిపల్ నూతన చైర్మెన్‌గా ఎన్నికైన అశోక్ గౌడ్.. ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్‌ను శాలువాతో హరీశ్‌రావు సన్మానం చేసి అభినందించారు. నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలనిసూచించారు. మున్సిపల్ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, ఏసీఎస్ చైర్మెన్ రాజు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సింగయ్య పల్లి గోపి, బాల్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, పంబల బిక్షపతి, కుమ్మరి నాగేష్, సాగర్ కౌన్సిలర్లు ఉన్నారు.

లక్షాయాబైవేల ఎల్వోసీ అందజేత

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధి శెట్టిపల్లి గ్రామానికి చెందిన బి.కీర్తనకు అత్యవసర చికిత్స నిమిత్తం ఒక లక్ష యాభై వేల విలువగల ఎల్వోసీ లెటర్‌ను.. కీర్తన కుటుంబ సభ్యులకు హైదరాబాదు ముషీరాబాద్ క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కీర్తన శస్త్ర చికిత్స విషయాన్ని ఎమ్మెల్యే సున్నిత లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లగా ఆమె వెంటనే స్పందించి ఎల్వోసీ అందజేసిందన్నారు.

దీపానికి చీర తగిలి నిప్పంటుకోవడంతో మహిళకు గాయాలు

నవతెలంగాణ-నిజాంపేట



ప్రమాదవశాత్తు దీపానికి చీర తగలడంతో నిప్పంటుకుని ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నిజాంపేట మండలంలోనీ కల్వకుంటలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుంట్ల గ్రామనికి చెందిన కోమల సువర్ణ గత కొన్నేండ్లుగా బాధపడుతున్నది. అయితే ఆది వారం తన ఇంటి పూజగదిలో ప్రమాదవశాత్తు దీపానికి ఆమె చీర తగలడంతో నిప్పంటుకున్నది. ఈ ప్రమా దంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది వచ్చి మహిళను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు గీతా స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-మనోహరాబాద్

నర్సాపూర్‌లో జరిగిన మెదక్ జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో తూప్రాన్ గీతా హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటకృష్ణారావు తెలిపారు. ఆదివారం నర్సాపూర్ లయన్స్ క్లబ్‌లో జరిగిన చెకుముకి పోటీల్లో గీతా పాఠశాలకు చెందిన వినయ్ (పదోతరగతి) నిశాంత్ (తొమ్మిదో తరగతి) జశ్వంత్ (ఎనిమిదో తరగతి)లు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో.. ఈనెల 9, 10, 11 తేదీల్లో హైదరాబాదులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరెక్టర్ మరియు మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్, డైరెక్టర్ మరియు మున్సిపల్ కౌన్సిలర్ నారాయణ గుప్త, సైన్స్ ఉపాధ్యాయులు హరికుమార్, సల్మా, కవిత, సందీప్, విజయన్,విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



పటాన్‌చెరుకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-జిన్నారం

పటాన్చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్లమెంటరీ ఎన్నికల సన్నాక సమావేశానికి జిన్నారం మండలం నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేష్ గౌడ్, ఎంపీటీసీలు ఆకుల భార్గవ్ మాజీ సర్పంచులు ప్రకాశం చారి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్‌లతో పాటుగా పలువురు నేతలు మాజీ మంత్రి హరీశ్‌రావును, ఇతర నాయకులను సన్మానించారు.

నేడు విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం గడ్డపోతారంలోని పులిగిల్ల ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) ఉదయం 9 గంటలకు పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. జిన్నారం మండల పరిధిలోని పదో తరగతి సంబం ధించిన ప్రభుత్వ ప్రైవేటు విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం పట్టణంలోని బీరంగూడ కమాన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురానికి చెందిన అమీర్(27) పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని ఓ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి తన బైక్‌పై బయలుదేరాడు. బీరంగూడ సమీపంలోని యూ టర్న్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న ఓ కారు.. అమీర్ బైక్‌ను ఢీ కొట్టింది. దాంతో అతని తలకు ధరించిన హెల్మెట్ పగిలిపోయింది. కాళ్లకు, తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

హుస్నాబాద్ మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్ల ను పట్టుకున్నట్లు హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ తెలిపారు. ఆ ఐదు ట్రాక్టర్‌లను మైనింగ్ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అట్టల పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-వెల్దుర్తి





మండల కేంద్రమైన మాసాయిపేట శ్రీ లక్ష్మీ గణపతి ప్యాకింగ్ ప్రొడక్ట్ అట్టల పరిశ్రమలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పరిశ్రమలోని రెండు భారీ విద్యుత్తు మోటర్లు, భారీ ఎత్తున కోడిగుడ్ల ప్యాకింగ్ మెటీరియల్‌తో పాటు పరిశ్రమలోని స్క్రాప్ దగ్ధమ య్యాయి. మంటు ఎగిసిపడడంతో కార్మికులు వెంటనే రామాయంపేటలోని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందజే శారు. ఫైర్ ఇంజన్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే మంటలను అదుపు చేశారు. పరిశ్రమలోని వివిధ భాగాలకు అంటుకున్న మంటలను సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఫైర్ ఇంజన్ సహాయంతో సిబ్బంది అదుపు లోనికి తెచ్చారు. కాలుతున్న పరిశ్రమలోని పలు విడిభాగాల మంటలను రెండు జేసీబీల సాయంతో ఆర్పేశారు. ఈ సం ఘటనలో పరిశ్రమలోని కార్మికులు సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చేగుంట ఎస్సై హరీష్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిప్రమాద పరిస్థితులను సమీక్షించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి
- బండాపోతుగల్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-చిలిపిచేడ్



క్రీడలు శారీరక ధారుడ్యానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. చిలిపిచేడ్ మండలంలోని బండాపోతుగల్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతరం క్రికెట్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి,అధ్యక్షుడు పాండరి, గ్రామాధ్యక్షుడు మంతూరి మల్లేశం, నాయకులు సుభాష్ రెడ్డి, శంకర్ రెడ్డి,వెంకట్ రెడ్డి, సుధీర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శశికాంత్, రవి, గ్రామస్తులు లక్ష్మారెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మల్లారెడ్డి, షఫి, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-మనోహరాబాద్

కాంగ్రెస్ పార్టీ పాలనలోనే సామాన్య ప్రజలకు మేలు జరగడంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండలంలోని కూచారంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ ఎంపీటీసీ నాయిని లక్ష్మి నర్సింలు గౌడ్‌తో పాటు మరి కొంతమంది నాయకులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. సామాన్య ప్రజలకు మేలు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. దొరల పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని.. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాయిని అంజనేయులుగౌడ్, నాయకులు కావేరిగారి భగవాన్‌రెడ్డి, సంతోష్ పంతులు, పల్లెర్ల రవిందర్‌గుప్తలతో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సేవలాల్ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని పెద్దతాండాలో సేవాలాల్ మహారాజ్ దేవాలయ 14వ వార్షికోత్సవాన్ని తాజా మాజీ సర్పంచ్ చత్రియా నాయక్, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చుట్టు ప్రక్కల సేవాలాల్ ఆలయాల నుంచి ఇరవై మంది పూజారులకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. పెద్ద తాండా పూజారులు మంగ్యా మహారాజ్, చందర్ మహారాజ్ ఆహ్వానిత పూజారులతో కలిసి ఆలయ ఆవరణలో చండీ యాగం, పూజాది కార్యక్రమాలు నిర్వ హించారు. జెడ్పీటీసీ, మండల నాయకులు జగదాంబ మాత, సెవాలాల్ మహారాజ్ లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగం అనంతరం పూజారులకు, అతిథులకు ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలో జెడ్పీటీసీ, మండల అధ్యక్షుడితో పాటు నార్సింగి వైస్ ఎంపిపి సుజాత శంకర్, ఎంపీటీసీలు సత్యనారాయణ, సుజాత మల్లేశం, నార్సింగి తాజా మాజీ ఉప సర్పంచ్ కాలేరు యోగి, పెద్ద తాండా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాషా నాయక్, బిక్యా నాయక్, నార్సింగి పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి భూపతి రాజు తాండా ప్రజలు పాల్గొన్నారు.

సంఘటితమే బలం

వతెలంగాణ-పాపన్నపేట



సంఘటితమే బలం అని.. మనమందరం మరింత ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పాపన్నపేట మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు టప్ప రాములు పిలుపునిచ్చారు. మున్నూరుకాపు పాపన్నపేట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి.. యువజన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. అందరితో స్నేహ సంబంధాలు పెంచ ుకుంటూ సమయస్ఫూర్తితో అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు తమ ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువజన సంఘం అధ్యక్షులుగా అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దిలీప్ కుమార్, కార్యదర్శిగా అభిరామ్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, అభిలాష్ తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి అందరు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకరి కిష్టయ్య, ఆకుల శ్రీనివాస్, సంగమేశ్వర్, మల్లన్న, ఉమామహేశ్వర్, ప్రసాద్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పద్మశాలీల వనభోజన కార్యక్రమం

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 29వ వనభోజన కార్యక్రమాలను ఆదిఆరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్, శాసనమండలి సభ్యులు ఆర్ సత్యనారాయణ, న్యాయమూర్తి నామాల అశోక్, జహీరాబాద్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి, జహీరాబాద్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్దన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాటాడుతూ.. పద్మశాలీలు ఎంతో ప్రతిభ శాలీలు అని.. వారు రాజకీయంగా ఎదగాలని కోరారు. పద్మశాలీల ఎదుగుదల కోసం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నదని మాజీమంత్రి చంద్రశేఖర్ అన్నారు. ఎవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే.. ఆ సమస్యలన్నీ పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. శాసన మండలి సభ్యులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పద్మశాలీ బాల బాలికలు ప్రభుత్వ సహాయ సహకారాలు పొందుతూ ఉన్నత విద్యలు చదువుకుని వివిధ రంగాల్లో ఎదగాలన్నారు. అంతేకాకుండా పద్మశాలి కుటుంబాల పూర్తి వివరాలను సేకరించి కంప్యూటర్లో పొందుపరచాలని ఇతరత్రా రాష్ట్రాల్లో ఉన్న పద్మశాలీలను గుర్తించి వారి సహాయ సహకారాలు అందుకొని భవిష్యత్తులో ఎదగాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు జహీరాబాద్ పట్టణ మాజీ అధ్యక్షులు డాక్టర్ సోమచంద్రశేఖర్, న్యాయవాదులు కరదాస్ పవన్ మాశెట్టి, జగదీష్, పి.రాములు నేత, జహీరాబాద్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం నాందేవ్, కర్దాస్ మనోహర్, సుదర్శన్, బండారి మంత్రి వీరేశం, అర్జున్, కనుకుంట్ల నర్సింలు, ఒగ్గు విట్టల్, మల్లన్న పెగడ శ్రీనివాస్, గూడ జగన్, సగం విటల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-నార్సింగి

మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులను హైదరాబాద్‌లోని వారి నివాసంలో మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రోహిత్, హనుమంతరావులను మర్యాద పూర్వకంగా కలిసి.. నార్సింగి మండలాభివృధి కోసం విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. కాగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని త్వరలోనే మండల పర్యటన చేస్తానని, అన్ని విధాలుగా మండలాన్ని అభివృధి పరుస్తామని హామీ ఇచ్చారన్నారు. గోవర్ధన్‌తో పాటు మెదక్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశవులు, జప్తి శివనూర్ మాజీ ఉపసర్పంచ్ రుక్కుద్దిన్, శేరిపల్లి మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మి నర్సింహులు, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ళ చిన్న కృష్ణా గౌడ్‌లు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి..



నవతెలంగాణ-మనోహరాబాద్

యువత అనుకుంటే అసాధ్యమనేది ఏదీ లేదని.. దేశాభివృద్ధి యువతతోనే సాధ్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 300 వారం స్వచ్ఛ భారత్ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఆరేండ్లుగా నేచర్ ఐకాన్ యూత్ గ్రామాభివృద్ధితో పాటు స్వచ్ఛభారత్‌తో గ్రామ పరిశుభ్రతకు పాటుపడడం చాలా అభినందనీయమన్నారు. ఇతరులకు అవగాహన కల్పించడంతో పాటు పరసరాల పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం యువతతోనే సాధ్యమన్నారు. వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని.. ఎవరికి ఏ ఆపద వచ్చినా ఏం పని కావాలన్నా తనకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడొచ్చని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనతో అందరికి అందుబాటులో ఉండి పని చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో యువత గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారని.. వారికి ఒక లైబ్రరీ భవనం కావాలని అలాగే స్థానికంగా ఉన్న పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగాలు వచ్చేవిదంగా ఆదేశాలు ఇవ్వాలని యువకులు కోరారు. దాంతో నర్సారెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలలో సీఎస్ఆర్ నిధులు ఉంటాయని.. గ్రామాభివృద్ధి కోసం నిధులు కావాలంటే వారే ఇస్తారన్నారు. ఆ నిధులను వసూలు చేసే క్రమంలో తాను కూడా వస్తానని.. వాటితో అభివృద్ధి పనులను చేద్దామన్నారు. అంతేకాకుండా త్వరలోనే మంత్రి సీతక్కను గ్రామానికి పిలిపించి లైబ్రరీ భవనానికి కూడా భూమి పూజ చేయిద్దామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావ్, సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాయిని లక్ష్మి నర్సింలుగౌడ్, ఉపసర్పంచ్ నాయిని అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జీఎంఆర్ శ్రీనివాస్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, జీడిపల్లి కార్యదర్శి సత్యనారాణ, సంతోష్ పంతులు,నేచర్ ఐకాన్ యూత్ సభ్యులుపాల్గొన్నారు.

కార్మికు హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేశం
- ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

నవతెలంగాణ-చేగుంట

కేంద్రంలోని మోడీ బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మల్లేశం విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చేగుంట మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు అవుతున్నా.. కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. అచ్చేదిన్ ఆయాగా, మేకిన్ ఇండియా అంటూ మోసపూరిత నినాదాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. నేటికీ ఏ హామీని అమలు చేయలేదన్నారు. ప్రతీయేడు రెండు కోట్ల ఉద్యోగాలు, పేద కుటుంబానికి రూ. 15 లక్షలు అకౌంట్‌లో జమ, ధరలు తగ్గిస్తాం అనే హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. పభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కార్పోరేట్లకు అప్పజెప్పుతున్నదన్నారు. కార్మిక హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. రైతులకు నల్ల చట్టాలు తీసుకువస్తే.. ఏడాది పాటు రైతులు వీరోచితంగా పోరాడి మోడీ మెడలు వంచారని గుర్తు చేశారు. కేంద్ర బీజేపీ సర్కార్ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే కుట్ర చేస్తున్నదన్నారు. ధరలు విపరీతంగా పెంచి, మధ్యతరగతి ఉద్యోగులను, ప్రజలను నడ్డి విడిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన రోజులు దగ్గరలో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించి మోడీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రాంతం కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కూలీలు గ్రామీణ బంద్ నిర్వహించి ఎక్కడికక్కడ దిగ్బంధం చేసి మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, నాయకులు ప్రవీణ్, మండల గ్రామపంచాయతీ యూనియన్ మండల నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు



నవతెలంగాణ-కౌడిపల్లి

గ్రామ పంచాయతీల సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల పదవీకాలం ముగియడంతో మండలం పరిధిలోని రాజిపేట పాలకవర్గం వీడ్కోలు సమావేశాన్ని ఆదివారం గ్రామపంచాయతీలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వినాయక యూత్ అధ్యక్షుడు, మెదక్ జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ గాండ్ల కృష్ణ ముదిరాజ్, యూత్ జనరల్ సెక్రెటరీ భాషయ్య, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సర్పంచ్ ఉప సర్పంచ్లను వార్డ్ మెంబర్లను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లింగం గౌడ్ మాట్లాడుతూ.. పదవీ కాలంలో చేసిన పనులను అభివృద్ధిని గుర్తు చేసుకుని ప్రజల అభివృద్ధి కోసం గ్రామ అభివృద్ధి కోసం పనిచేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామం అభివృద్ధి చేసినప్పుడే వ్యక్తికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంగౌడ్, ఉప సర్పంచ్ మాధవి శివ, వార్డు మెంబర్లు మన్నె ప్రవీణ్, యాద గౌడ్, భగవంతు గౌడ్, గ్రామస్తులు నాగభూషణం,గణేష్ గౌడ్, అశోక్ గౌడ్, మన్నె కుమార్, ప్రభాకర్, వెంకటేశం గౌడ్, సత్యనారాయణ, యాద గౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండలం జేపీ తండా గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ భిక్షపతి నాయక్ పదోతరగతి విద్యార్థులకు ఆదివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సిద్దిపేట శాసనసభ్యులు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచన మేరకు పదో తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. టీవీలు, సెల్ ఫోన్లకు పిల్లలకు దూరంగా ఉండేటట్లు తల్లిదండ్రులు చూడాలని పేర్కొన్నారు.నెల రోజులు చదువుపై శ్రద్ధ పెట్టేలాగా చూడాలని కోరారు.

సర్పంచ్‌గా రమేష్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్



పందిల్ల గ్రామానికి సర్పంచ్ గా తోడేటి రమేష్ ఐదు సంవత్సరాల కాలంలో చేసిన సేవలు అభినందనీయమని మిత్ర బృందం కొనియాడారు. ఆదివారం హైదరాబాద్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సర్పంచ్ తోడేటి రమేష్‌కు సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెలుదండి రమేష్, నూతి రాజేంద్రప్ర సాద్, తాటికొండ రాజశేఖర్ రెడ్డి, ఉప్పరపల్లి రమేష్ ,వెలుదండి సంతు ,బొద్దుల శ్రీనివాస్, నూతి శ్రీనివాస్ ,నూతి పరశురాములు, అక్కిపెల్లి శ్రీనివాస్ ,సుదగోని శంకర్, వెలుదండి అజయ్ ,పంతంగి సతీష్ ,గూల్ల సతీష్, పోలవేణి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-మద్దూరు



ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు సంబంధించి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని మద్దూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు మంద సుమన్ తెలిపారు. తేదీ:01.11.2020 నాటికి ఏదైనా డిగ్రీ పూర్తయిన యువతి యువకులు ఈనెల ఆరో తేదీ లోపు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ ములుగు



మృతుడి కుటుంబానికి కిసాన్ కాంగ్రెస్ ములుగు మండల అధ్యక్షుడు సింగం రాజు యాదవ్ రూ.5 వేలు, బైలంపూర్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బయన్నగారి శ్యాంసుందర్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. వారం రోజుల కిందట మండల పరిధిలోని బైలంపూర్ గ్రామానికి చెందిన గువ్వ నరేష్ అనారోగ్యం కారణంగా మరణించారు.

సబ్బుబిళ్ల మీద అంతర్జాతీయ క్యాన్సర్ చిత్రం

నవ తెలంగాణ -గజ్వేల్



అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సబ్బుబిళ్ల మీద క్యాన్సర్ చిత్రాన్ని చిత్రించి తమ సందేశాన్ని అందించారు శ్రీరామకోటి భక్త సమాజం అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు.చక్కటి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మెరుగైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు.

కొమురవెల్లి మల్లన్న ఆశీస్సులు ఉండాలి

నవతెలంగాణ కొమురవెల్లి



కొమురవెల్లి మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత నుండి ప్రారంభమయ్యే మల్లన్న జాతర సందర్భంగా దర్శనం కోసం తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా మల్లన్న ఆశీస్సుల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో కృషి చేశామని గుర్తు చేశారు. భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించిన కారణంగా స్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు.

టీజేఎస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ- గజ్వేల్



టీజేఎస్‌లో పలువురు చేరినట్లు తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ స్వామి తెలిపారు. ఆదివారం హైదరాబాదులో టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీజేఎస్లో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ కీసర స్వామి, నాయకులు శ్రీనివాస్, పప్పీ, స్వామి, ఆమోద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పోరాడుదాం

జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



బీసీల హక్కుల సాధనకు అందరం కలిసి పోరాటం చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంగం అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్ అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షులు సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు శ్రీ కొమ్ము ఉమేష్ యాదవ్ మాట్లాడుతూ బీసీల హక్కులకు బీసీల అభివృద్ధికై అందరం కలిసికట్టుగా పోరాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే ఎంపీ ఎలక్షన్లకు, స్థానిక సంస్థల ఎలక్షన్లలో బీసీలకు 60 శాతం సీట్లు దక్కేలా అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీసీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు 100 శాతం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చేర్యాల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రెడ్డికి జాతీయ మహానంది అవార్డు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



సిద్దిపేట ప్రముఖ జ్యోతిష్యుడు జ్యోతిష్య రత్నకర డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి జ్యోతిష్య రంగంలో, సాహిత్య రంగంలో తాను చేసిన సేవలకు రెండు అవార్డులు దక్కాయి. యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం సాహిత్య-జ్యోతిష్య రంగంలో విశిష్ట సేవలనందించే ప్రతిభావంతులకు అవార్డులు అందిస్తారు. ఈ సంవత్సరం సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి జ్యోతిష రంగంలో ప్రముఖ సేవలందించినందుకు జాతీయ మహానంది అవార్డును, సాహిత్య రంగంలో తెలుగు లెజెండరీ అవార్డును ఆదివారం వరంగల్ టిఎన్జీవో భవన్ లో అందజేశారు. గతంలో రాజేశ్వర్ రెడ్డి జ్యోతిష రంగంలో డాక్టరేట్ తో పాటు పలు అవార్డులు కైవసం చేసుకున్నారు.

నాకు న్యాయం చేయండి

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

నవతెలంగాణ-బెజ్జంకి

తనతో సహజీవనం చేసిన ప్రియుడు ఇప్పుడు మోసం చేసి దాటవేసే ధోరణి అవలంబించడంతో న్యాయం చేయాలని కోరుతూ ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు తన కుమారుడు, తల్లితో కలిసి బైఠాయించిన ఘటన మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం... చీలాపూర్ గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువతి నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ పట్టణానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆ దంపతులకు ఒక కుమారుడు జన్మించాడు. స్థానిక యువకుడు అమ్రరాజు క్రిష్ణ ఆ దంపతుల మధ్య కలహాలు సృష్టించాడు. ఆ భార్యాభర్తలను విడగొట్టాడు. కరీంనగర్ పట్టణ కేంద్రంలో ఆ వివాహితతో అమ్రరాజు కృష్ణ సహజీవనం ప్రారంభించాడు. ఆమెకు మూడు నెలల గర్భాన్ని తొలగించాడు. అనంతరం ఆమెను దూరంగా ఉంచడం ప్రారంభించాడు. దీంతో విసిగిపోయిన బాధితురాలు అమ్రరాజు కృష్ణ ఇంటి ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని కోరింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం బాధితురాలు తన ఇంటికి వెళ్లిపోవడం కోసమెరుపు.

బాధిత కుటుంబాలకు 'చెలిమి' చేయూత

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 59, 60 కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జగదేవపూర్ మండలం వట్టిపల్లి, గజ్వేల్ మండలం కోమటిబండలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు గుర్రం తులసీదాస్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కుంబి గ్రామానికి చెందిన పొట్టి పల్లి వారి నరేష్ సంవత్సర క్రితం బతుకు దెరువు కోసం జగదేవ్ పూర్ మండలం వట్టిపల్లి గ్రామం వచ్చారన్నారు.గ్రామంలో మేస్త్రి పని చేస్తు జీవనం సాగిస్తున్నరన్నారు.ఇదే క్రమంలో ఇటీవల పచ్చ కామెర్ల వ్యాధి తో చనిపోయారన్నారు.అతనికి భార్య సంధ్య, పిల్లలు అక్షయ, రక్షిత, అఖిలు లు ఉన్నారు.వారి పరిస్థితి పలువురు చెలిమి మిత్రులు తిగుల్ల కేశవ్,గుర్రం ఆంజనేయులు తెలుపరన్నారు. వారికి రూ.3వేల 500, నిత్యావసర సరుకులు రూ.6,500 నగదు అందించడం జరిగిందన్నారు.అంతే కాకుండా గ్రామానికి చెందిన వల్లంకొండ పోచయ్య వారి భార్య, తల్లి చనిపోగా ఇతనికి ఎవరూ లేరు ఒంటరిగా బతుకుతున్నారన్నారు.అతనికి రూ. 5 వేలు నగదు ను అందచేయటం జరిగిందన్నారు.గజ్వేల్ మండలం కోమటి బండ గ్రామానికి చెందిన ఉబ్బని అశోక్ పొలం పని చేస్తున్న క్రమంలో మూర్ఛ వచ్చి పొలంలోనే చనిపోయారన్నారు. మృతుని భార్య పోచమ్మ, పిల్లలు చరణ్, మహేష్, లు ఉన్నారన్నారు. ఫౌండేషన్



కోశాధికారి దొంతుల ఆనంద్ దృష్టికి తేగా వారికి నగదు, నిత్యవసరాల సరుకులు సుమారు 15 వేలు అందివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి దొంతుల ఆనంద్, సభ్యులు గుంటూకు శ్రీనివాస్,టెంట్ నర్సింలు, పెదూరి శ్రీనివాస్,యాట ఆంజనేయులు,తిగుల్ల కేశవ్, గుర్రం ఆంజనేయులు, నాగపురి బాబు తదితరులు పాల్గొన్నారు.

కొమురెల్లికి జాతరకు పోటెత్తిన భక్తజనం





- 3వ వారానికి భారీగా వచ్చిన భక్తులు
- స్వామివారి దర్శనానికి 6గంటల సమయం
- పట్నాలు వేసి బోనాలు చేసి మొక్కులు చెల్లించిన భక్తులు

నవ తెలంగాణ కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న జాతర ఆదివారం జోరుగా సాగింది. మల్లన్న నామస్మరణతో ఆలయం మార్మోగింది. శివసత్తుల పూనకాలుపోతురాజుల చిందులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి భక్తులు గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి స్వామివారికి వారికి ఓడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి పట్నాలు వేసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులుభారీగా తరలి రావడంతో స్వామి వారి దర్శనానికి 6 గంటల సమయం పట్టింది... స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి పండుగ అనంతరం వచ్చే మొదటి ఆదివారంతో మొదలైన జాతర ఉగాది పండుగ లోపు వచ్చే చివరి ఆదివారాన్ని జాతర వారాలుగా పేర్కొంటారు భక్తులు ప్రత్యేక అలంకరణలతో బోనాలు చేసి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గుట్టపై ఉన్న ఎల్లమ్మకు బోనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయం నాలుగు గంటల నుండి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ధర్మ దర్శనంలో భక్తులు 6 గంటలు, ప్రత్యేక దర్శనం లో 4గంటలు, శీఘ్ర దరశనంలో 3 గంటలు.వీ.వీఐపీ దర్శనాలకు 2 గంటలు భక్తులు వేచి ఉన్నారు. -స్వామివారి దర్శనం కోసం దూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు పాలక మండలి సభ్యులు సేవలందించారు ఆలయ ఈఓబాలాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఈఓ శ్రీనివాస్ ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, నర్సింహులు, భక్తులకు సేవలు అందించారు.



మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో మల్లన్న ఆలయానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మహాదేవుని శ్రీనివాస్ కొయ్యడ శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, సార్ల లింగం, కురుమ సంఘం నాయకులు అందే అశోక్, అందే బీరయ్య, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవాలయం ముస్తాబు

నేటి నుంచి దుద్దెడ శంభో దేవుని బ్రహ్మోత్సవాలు

నవ తెలంగాణ - కొండపాక

కొండపాక మండలం దుద్దెడలోని స్వయంభూ శంభుదేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాలు నిర్వహించడానికి దేవాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాన్ని రంగు రంగు దీపాలతో అలంకరించారు. పందిళ్ళు వేశారు. మూడో రోజు నాడు జరిగే శివపార్వతుల కల్యాణం అట్టహాసంగా నిర్వహిస్తారు. ఈ నెల 5న విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని స్వయంభూ శంభు లింగేశ్వర సేవాసమితి ట్రస్ట్ సభ్యులు తెలిపారు. పుణ్యాహవాచనము, అంకురార్పణ, మూలవిరాట్ అభిషేకము, అమ్మవారికి అభిషేకము, సాయంత్రం శకటోత్సవం దేవాలయం చుట్టూ వాహనాలు బండ్లు తిరగడం, అనంతరం తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం రోజున స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర వారాభిషేకము, శంభు దేవునికిఅన్నాభిషేకం, లక్ష్మీ గణపతి హెూమము నవగ్రహ రుద్ర మన్య పాశుపత హవనం, సుదర్శన హెూమము, చండీ హెూమం జరుగుతాయన్నారు. రాత్రి దిష్టి కుంభాలనిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. మూడో రోజు మంగళవారం ఉదయం స్వామివారి ఎదుర్కోలు, అనంతరం అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నదాన వితరణ, రాత్రి స్వామివారి రథోత్సవం, ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఆలయ చరిత్ర

తెలంగాణ ప్రాంతం శైవ దేవాలయాలకు ప్రసిద్ధి. కాకతీయుల కాలంలో చక్కటి కళా నైపుణ్యంతో నిర్మించిన ఎన్నో దేవాలయాలు పురాతన స్థితికి చేరుకున్నాయి. వాటిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఎంతో మంది ఆయా గ్రామాల్లో ఆ దేవాలయాలను కాపాడుతూ వస్తున్నారు. ఆనాటి నుంచి నేటి



వరకు ప్రతి ఏటాఉత్సవాలు నిర్వహించడం భక్తి భావాన్ని పెంపొందించదమే. ఇలాంటి దేవాలయాల్లో కొండపాక మండలం దుద్దెడ లోని రాజీవ్ రహదారి పక్కన గల స్వయంభు దేవాలయం ఒకటి అని చెప్పవచ్చు. పదవ శతాబ్దమునకు పూర్వం స్వయంగా వెలసిన స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవాలయం విశిష్టతల కు నిలయం. భక్తుల పాలిటి కల్పవృక్షమై కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారమై భక్త జనావళి నీరాజనాలు అందుకుంటూ మహిమాన్విత సిద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్నది. ప్రధాన దేవుడు జలలింగముగా, అమ్మవారు శివ శక్తి స్వరూపిణిగా వెలిసి విరాజిల్లుచున్నది. ఈ దేవాలయము పానగల్లు రాజైన మాధవరెడ్డి దేవాలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. దేవాలయ ఆవరణలో గల శిలాశాసనం ఆలయ చరిత్రను తెలుపుతుంది. ఈ ప్రాచీన ఆలయానికి ప్రాకారాలు నిర్మించి స్వామి సేవకు అవసరమగు నీటి కొరకు కోనేరు నిర్మించారు. ఉత్తరద్వారం ఐదు అడుగుల ఎత్తు కాశి కి వెళ్లే మార్గం అని, రెండో ద్వారం వేములవాడకు, దక్షిణ ద్వారము కొమురవెల్లి మల్లికార్జున స్వామి వద్దకు వెళ్లే మార్గమని దక్షిణ నైరుతి మార్గము రాముని గుట్టకు వెళ్లే మార్గమని, పశ్చిమ ద్వారం ప్రధాన దేవాలయమునకు, ఉత్తర ఈశాన్యం సొరంగం అప్పలాయ ఆంజనేయ స్వామి ఆలయానికి మార్గాలు ఉన్నాయి.

గ్రామాల్లో కాంగ్రెస్ బలోపేతం కావాలి

నవతెలంగాణ-మద్దూరు

గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న చిల్లర చేష్టలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని మద్దూరు జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి అన్నారు. దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఆదివారం. జనగామ డిసిసి అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, ఎంపీటీసీ నంకులతో కలిసి గ్రామ కమిటీ వేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామ గ్రామాన బలోపేతం కావాలని ఆయన అన్నారు.రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం గ్రామ కమిటీని వేశారు, గ్రామ శాఖ అధ్యక్షులు తొర్రి మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ధరావత్ రాజు, పేరబోయిన రాజు, ప్రధాన కార్యదర్శి మంద పవన్, భీమగోని రాకేష్, గుగులోతు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు స్వరూప,గట్టయ్య, యాదయ్యా,కనుకయ్యా, శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఆదేవిధంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుగులోతు సంతోష్, ఉపాధ్యక్షులు బోల్లబోయిన మహేష్, కార్యదర్శి కొయ్యడ మధు గార్లను ఎన్నుకోవడం జరిగింది,ఈ కార్యక్రమంలో బెక్కల్ సర్పంచ్ బాలరాజు యాదవ్, లింగాపూర్ ఉపసర్పంచ్ జెల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు

నవతెలంగాణ-గజ్వేల్

కేవలం తెలంగాణలో రెండు నెలల కాల పరిమితిలోపే ప్రజాపాలన అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని వేదన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం తమ పార్టీ అధిష్టానాన్ని మెప్పించటానికి ఎంపీ సీటు గురించి మాత్రమే ప్రజా పాలన అందిస్తున్న రేవంత్ రెడ్డి ని విమర్శిస్తే ఎంపీ సీటు వస్తుందని భ్రమ పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గానీ పత్తిపక్షంలో ఉన్న నేడుగాని మహిళలకు గౌరవించలేదు మొదటి ఐదు సంవత్సరాలు మహిళా మంత్రులు లేకుండా పాలించిన బిఆర్ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారిక మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే దానిని ఓర్వలేక ఆటో డ్రైవర్ సోదరులను రెచ్చగొడుతున్నా విధానాన్ని యావత్తు మహిళ లోకం గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కొడకండ్ల బాలు అందిపూర్ బాలా గౌడ్ డబ్బు గణేష్ సమీర్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

అనుభూతులు ఇచ్చిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ- గజ్వేల్

ఎన్నో అనుభూతులకు సమ్మేళనం కల్పించిన పూర్వ విద్యార్థుల కలయిక అందర్నీ సంతోషపరిచింది. 1985 -86 పదవ తరగతి జిల్లా పరిషత్ గజ్వేల్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఒకేచోట కలవడం అందరిని ఎంతో సంతోషపరిచింది. దాదాపు 35 సంవత్సరాల తర్వాత వారందరూ కలుసుకున్నారంటే వారి అనుభూతులు, అనురాగాలు పాఠశాలలో చేసిన చిలిపి చేష్టలు తదితర వాటిని నెమరు వేసుకున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఎన్నో అనుభూతులను అనురాగాలను పంచిందని చెప్పాలి. 35 సంవత్సరాల ముందున్న గురువును రప్పించి ఘనంగా సన్మానించారు. సుమారు 50 మంది వరకు పూర్వ విద్యార్థులు ఒకచోట కలవడంతో వారి కేరింతలకు అవధులు లేవు. గురువు సైతం నేను సైతం అన్నారు. ఎన్నో విషయాలను నెమరు వేసుకున్నారు. సమాజంలో జరుగుతున్న రుక్మతులను ఎదుర్కొంటున్న సమయంలో కుల బాంధవులు దూరమవుతున్న సమయంలో ఇంతమంది ఒకే చోట పూర్వ విద్యార్థులు కలవడం అందరిని సంబరపరిచింది. ఇందులో గురువుకి రామచంద్ర జి, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వంటేరు మధుసూదన్ రెడ్డి, పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాండరీ, ప్రసాద్, సతీష్, నర్సింలు తదితరులు నిర్వాహకులుగా మారి వచ్చిన పూర్వ విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు.

ఉత్తమ సేవలకు అరుదైన సత్కారం

నవతెలంగాణ-అక్కన్నపేట



ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన రైతు ఉత్పత్తిదా రుల సంఘాల ప్రతినిధిగా, జర్నలిస్ట్ గా నారదాసు ఈశ్వర్ ముదిరాజ్ పాల్గొనడం అభినందనీయమని అక్కన్నపేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రామస్తులతో కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతలమల్లారెడ్డి, చింతల సంజీవ రెడ్డి,కందుల శ్రీనివాస్ రెడ్డి,నక్క బాలయ్య, మి ట్టపెల్లి వెంకటయ్య, ఎలసాని వెంకటయ్య, ముద్రబోయిన కొమురయ్య, ఆర్ఎంపీ భూక్య శ్రీనివాస్,బుడిమే సురేష్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

జెల్ల ఐలయ్యకు జాతీయ ఉత్తమ సర్పంచ్ పురస్కారం

నవతెలంగాణ-బెజ్జంకి



స్వామి వివేకానంద,నేతాజీ సుభాష్ చంద్రబోస్ జాతీయ ఉత్తమ సర్పంచ్ పురస్కారాన్ని మండల పరిధిలోని రేగులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జెల్ల ఐలయ్య ఆదివారం అందుకున్నారు. హన్మకొండలోని టీఎన్ జీఓ భవన్ యందు శ్రీ శాంతికుమారి,శ్రీ విశ్వకర్మ సేవా ఫౌండేషన్,తెలుగు వెలుగు సాహితి వేదిక,విశ్వకర్మ గాయత్రి నాట్య వేదిక సౌజన్యంతో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ అద్వర్యంలో ఏర్పాటు చేసిన పురస్కార ప్రధానోత్సవంలో హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జెల్ల ఐలయ్యకు జాతీయ ఉత్తమ పురస్కారం ప్రధానం చేశారు.జాతీయ పురస్కారానికి ఎంపికైన ఐలయ్యను మండలంలో పలువురు సర్పంచులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఎంపీగా వినోద్ కుమార్‌ను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్



కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి బోయినపల్లి వినోద్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా ప్రస్తుత హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ అవకాశం కల్పించాలనీ పార్టీ అధినాయకత్వాన్ని కోరుతూన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ,పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించండి

నవతెలంగాణ-బెజ్జంకి



గత 30 ఏండ్లుగా నిర్మించుకున్న పశువుల, గొర్రెల పాకలను, వృద్ధులు నిర్మించుకున్న రెకుల షెడ్లను మండల అధికార యంత్రాంగం ముందస్తు సమాచారమివ్వకుండా తొలగించి విధ్వంసం చేసిందని, పరిహారం అందించి న్యాయం చేయాలని గూడెం గ్రామంలోని బాధితులు కోరారు. శనివారం మధ్యాహ్నం గూడెం గ్రామ శివారులోని 321 సర్వే నంబర్‌లో నిర్మాణాలను అధికార యంత్రాంగం తొలగించడం దుశ్చర్యేనని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు తాము ఆటంకం కాదని తెలిపారు. అధికారులు తొలగించిన పశువుల, గొర్రెల పాకలు, వృద్ధుల నివాసాలకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు బాధితులు విజ్ఞప్తి చేశారు.

ఇథనాల్ పరిశ్రమపై ముదురుతున్న వివాదం

- బోరు బావి పనులను అడ్డుకున్న గుగ్గీల్ల గ్రామస్తులు
- తోడిన బోరుబావిని పూడ్చిన వైనం

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామ శివారులో నిర్వహించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమపై రోజురోజుకు వివాదం ముదురుతోంది. గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ పనుల కోసం యాజమాన్యం బోరుబావి పనులను ఆదివారం చేపట్టింది. సమాచారం తెలుసుకున్న గుగ్గీల్ల గ్రామస్తులు బోరుబావి పనులను అడ్డుకున్నారు. సుమారు రెండోందల పీట్ల వరకు తవ్విన బోరుబావిని గ్రామస్తులు పూడ్చివేశారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ కోసం జారీ చేసిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని లేనిపక్షంలో అందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని గ్రామస్తులు హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి ప్రాజెక్టులకు కస్తూర్బా గాంధీ పాఠశాల ఎంపిక

నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రస్థాయిలో 2022-23లో నిర్వహించిన ప్రేరణ మనక్ కార్యక్రమంలో మద్దూరు కస్తూర్బా గాంధీ విద్యార్థి దీక్షిత రూపొందించిన బయో ప్లాస్టిక్ బై యూజింగ్ బనానా స్టేవ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కస్తూర్బా గాంధీ ఎస్ఓ స్వప్న ఆదివారం తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 1666 ప్రాజెక్టులు అప్లోడ్ చేశారని వాటిలో 156 ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఫిబ్రవరి 1 నుండి 2 తేదీలలో మూల్యాంకనం చేయడంతో వాటిలో 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని అందులో మద్దూరు కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థి దీక్షిత రూపొందించిన బయో ప్లాస్టిక్ బై యూజింగ్ బనానా స్టేవ్ కు రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడం జరిగినట్లు ఆమె తెలిపారు. విద్యార్థి వ్యక్తిగత అకౌంట్లో పదివేల రూపాయల ను ప్రభుత్వం జమ చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థి దీక్షితను ఉపాధ్యాయులు అభినందించారు

బాధిత కుటుంబానికి ఆపన్నహస్తం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ ఆత్మస్థైర్యాన్ని నింపేది ఆపన్న హస్త మిత్రబృందం అని అధ్యక్షులు పాశికంటి బాల చంద్రం అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలంలోని రిమ్మన గూడలో 84వ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపన్నహస్త మిత్ర బృందం గజ్వేల్ వారి 84 వ ఆర్థిక సహాయ కార్యక్రమం నిర్వహించమన్నారు.మండలపరిధిలోని రిమ్మన గూడ గ్రామానికి చెందిన సిద్దాల శివ కుమార్ అనారోగ్యంతో చనిపోయారన్నారు. చాలా బీద పరిస్థితి అస్తి పాస్తులు కూడా లేవన్నారు. ఇతనికి భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. ఉండడానికి ఇల్లు లేదని తెలుసుకొని వీరికి భరోసాగా మా వంతు రూ.15 వేలునగదు, రూ.5 వేళా కిరానం సరుకులు,రూ20 వేలవరకు ఆర్థికంగా సహాయం అందివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోషాధి కారి కొల్లూరి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మంగలి సాయి, సభ్యులు, కొలిచెలిమే స్వామి, సత్యనారాయణ, శ్రీరామ్ కృష్ణ, శ్రీకాంత్, గిరిబాబు, అరవింద్, గణేష్, రఘు, మల్లికార్జున్, రమేష్, రాజేశం, బాలనర్సు, కనకయ్య, కుటుంబ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.